
సాక్షి
బాపట్ల
సోమవారం । 7 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 3,007 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1,005 క్యూసెక్కులు వదిలారు.



మణిపూర్ ఘటనపై నిరసన

మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను నిరసిస్తూ ఆదివారం హోసన్న క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. -8లో



కార్తికేయుని సేవలో ఎంపీ

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తులకు 10వ తేదీ గడువు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.నరసింహారావు తెలిపారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి జరిగే జేఎన్‌వీఎస్‌టీ -2024 పరీక్షను వచ్చే ఏడాది జనవరి 20న నిర్వహించనున్నట్లు వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 80 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసి వారికి 6 నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌లో అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తామని పేర్కొన్నారు. ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యతోపాటు హాస్టల్ ఇతర వసతులను కల్పించనున్నట్లు వెల్లడించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీ

కలెక్టర్ శివశంకర్ లోతేటి



నరసరావుపేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా కీలకమని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీపై కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఓటర్ల సర్వే తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా తయారీపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

ప్రారంభమైన రోల్ బాల్ పోటీలు



గుంటూరువెస్ట్ (క్రీడలు): రోల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో అండర్-11, 17 విభాగాల్లో పోటీలు ఆదివారం స్థానిక బీఆర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, నెల్లూరు, చిత్తూరు, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, పశ్చిమగోదావరి నుంచి చిన్నారులు పాల్గొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభకనబరిచిన వారిని ఈనెల 14, 15 తేదీల్లో కేరళలోని కొల్లంలో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

సుబ్బారాయుడి నిత్యాన్నదానానికి విరాళం



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో నిత్యాన్నదానానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అభిమానులు రూ. 1,00,116 విరాళంగా అందచేశారు. ఆదివారం వెంకట రమణ పుట్టిన రోజు సందర్భంగా కొక్కిలిగడ్డ ప్రశాంత్ కుమార్ ఫ్రెండ్ సర్కిల్ నేతృత్వంలో స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యాన్నదానానికి విరాళాన్ని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు అందించారు.

అలరారుతున్న రొయ్య

- కలిసొస్తున్న సముద్రపు వేట
- మత్స్యకారుల 'సంబర'మాశ్చర్యాలు
- వెనామీ, టైగర్ రొయ్యలతో నిండుతున్న వలలు



సముద్రంలో లభ్యమైన వెనామీ రొయ్యలు

రొయ్యల ధరలు ప్రస్తుతం ఇలా..

కౌంట్	రూపాయల్లో
100	200
90	210
80	220
50	240
40	280
30	390
20	500-510

బాపట్ల: సముద్రపు జలాల్లో రొయ్యలు అలరారుతున్నాయి. ఫలితంగా మత్స్యకారుల వలలు నిండుతున్నాయి. ఈ ఏడాది రెండునెలలుగా వేట బాగా కలిసివస్తోందని గంగపుత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మత్స్య సంపద విశేషంగా లభిస్తోందని చెబుతున్నారు. కోనమ్, చందువాలు, మొయ్య, పండు చేపలతోపాటు రొయ్యలూ బాగా లభ్యమవుతున్నాయని పేర్కొంటున్నారు. గతంలో సముద్రపు రొయ్యలు పరిమితంగా లభ్యమయ్యేవి. కానీ ఇప్పుడు 20 కౌంట్ రొయ్యలు కూడా దొరకుతున్నాయి. దీంతో మత్స్యకారులు చేపల కంటే రొయ్యల కోసం ప్రత్యేక డిస్కో వలలను సిద్ధం చేసుకుని తీసుకెళ్తున్నారు.

25 కౌంట్ రావాలంటే గగనమే

సాధారణంగా ఆక్వా సాగులో 40 నుంచి 25 కౌంట్ చూడాలంటే రైతులు ఎంతో కష్టపడాల్సి వస్తోంది. వైరస్‌లు, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని సాగు చేయాలి. అలాంటిది సముద్రంలో 20 కౌంట్ రొయ్యలు పడుతుండడంతో మత్స్యకారుల సంబరానికి అవధుల్లేకుండా పోతోంది. సముద్రపు రొయ్యకు మార్కెట్లో మంచి గిరాకీ కూడా ఉంటోంది. ఇటీవల కొద్దిరోజులుగా ఓడరేవు మార్కెట్ రొయ్యలతో కళకళలాడుతోంది. గతంలో వారాలకుపైగా సముద్రంలో వేట సాగించే మత్స్యకారులు ఇప్పుడు రొయ్యలు బాగా పడుతుండడంతో రెండు, మూడురోజులకే బయటకు వస్తున్నారు. సరుకు దించి మళ్లీ వేటకు వెళ్తున్నారు. బాపట్ల మండలంలోని అడవిపల్లెపాలెం, కృపానగర్, దాన్వాయ్‌పేట, ఓడరేవులలో వేట సాగుతుంటుంది. ఈ ప్రాంతంలో మూడువేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. 800 వరకు వేట సాగించే పడవలు ఉన్నాయి. ఒక్కొక్క పడవకు ఎనిమిది నుంచి 10 మంది వేటకు వెళ్తున్నారు.



వేటకు వెళ్తున్న మత్స్యకారులు

గంగపుత్రుల 'ధర'హాసం

వెనామీ, టైగర్ రకం రొయ్యలూ సముద్రంలో అధికంగా లభ్యమవుతున్నాయి. 400 కేజీలు రొయ్యలు పడితే వాటిలో 40 నుంచి 50 కేజీలు టైగర్ రొయ్య అదీ 20 నుంచి 40 కౌంట్ ఉన్నవి పడుతున్నాయి. మిగతావి వెనామీ రొయ్యలు పడుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో వెనామీ 40 కౌంట్ రొయ్యలు రూ.480 నుంచి రూ.500 పలుకుతుండగా, టైగర్ రొయ్య 20 కౌంట్ రూ.500 నుంచి రూ.600 వరకు పలుకుతోంది.

తక్కువ దూరంలోనే..



వాతావరణం అనుకూలంగా ఉండటంతో సముద్ర తీరం నుంచి 20 నుంచి 30 కిలోమీటర్లు వెళ్లే సరికే మత్స్యసంపద పడుతోంది. అందువల్ల ఖర్చు కూడా తగ్గుతోంది. రొయ్యలు బాగా పడుతున్నాయి.

– జి.అప్పలరాజు, మత్స్యకారుడు

రొయ్యలు బాగా పడుతున్నాయి



రొయ్యలు ఎక్కువగా పడుతున్నాయి. వీటిని చీరాల ఓడరేవు మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తున్నాం. కొనుగోలుదారులు కూడా వస్తున్నారు. వ్యాపారులు వారం రోజుల్లోపే కొనుగోలు చేసిన వాటికి నగదు చెల్లిస్తున్నారు. ఐస్, సబ్సిడీపై డీజిల్ అందిస్తే మాకు ప్రయోజనంగా ఉంటుంది.

– చొక్కా సత్యనారాయణ, మత్స్యకారుడు

గుంటూరులోనూ గళమెత్తిన గద్దర్

- ఉమ్మడి జిల్లాతో ప్రత్యేక అనుబంధం
- దళిత, బహుజన, ప్రజాసంఘాల నేతలతో పరిచయాలు
- ప్రజా గాయకునికి కన్నీటి నివాళి అర్పించిన అభిమానులు



2004 ఆగస్టు 6న చుండూరులో బాధిత కుటుంబాలతో గద్దర్ (ఫైల్)

తెనాలి: ప్రజా యుద్ధనౌకగా పేరొందిన గద్దర్ గళం మూగబోయింది. పీపుల్స్‌వార్, అనంతరం మావోయిస్టు, తెలంగాణ ఉద్యమాల్లో ఎందరినో ఉత్తేజపరిచిన ఆ గొంతుక ఇక వినిపించదని తెలిసి ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఎందరో అభిమానులు, దళిత, ప్రజాసంఘాల నేతలు విచారం వ్యక్తం చేస్తున్నారు. విప్లవ పార్టీలతోనే కాకుండా జిల్లాలో విద్యార్థులు, న్యాయవాదులు, దళిత బహుజనుల ఉద్యమాలతో ఆయనకు గల అనుబంధాన్ని స్మరించుకుంటున్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ ముఖ్యంగా యువకుడిగా ఉన్నప్పట్నుంచీ తెనాలికి రాకపోకలు సాగించారు. అప్పట్లో తెనాలి రాడికల్ కేంద్రంగా ఉండేది. రాడికల్ స్టేట్ యూత్ అధ్యక్షుడిగా ఉన్న అధ్యాపకుడు పీజే వర్ధనరావును కలిసేందుకు తరచూ గద్దర్ తన స్నేహితులతో సహా వచ్చేవారు. ఉద్యమాల్లోకి వచ్చాక విప్లవ పార్టీల సభలు, ఆందోళనల్లో పాల్గొనేందుకు జిల్లాలోని గుంటూరు, పల్నాడు, తెనాలి ప్రాంతాలకు పలు సందర్భాల్లో వచ్చారు. తెనాలిలో 1985 విరసం మహాసభలకు హాజరయ్యారు. డప్పు రమేష్ వివాహాన్ని ఆ సభల్లోనే జరిపారు. ఒడిశాలో ఆస్ట్రేలియన్ క్రిస్టియన్ మిషనరీ గ్రాహం స్టెయిన్స్ కుటుంబ సజీవ దహనానికి నిరసనగా 1999లో తెనాలిలో భారీగా జరిగిన కాగడాల ప్రదర్శన, బహిరంగ సభలో పాల్గొన్నారు.

చుండూరులో దళితుల హత్యాకాండ తర్వాత 2004 ఆగస్టు 6న మృతవీరులకు వరవరరావు, కళ్యాణరావుతో కలిసి గద్దర్ నివాళులర్పించారు. బహిరంగసభలో మాట్లాడారు. గుంటూరులో తొలిగా నల్లపాడు పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన విద్యార్థి సంఘాల మహాసభల్లో గద్దర్ ప్రసంగించారు. వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నక్సల్ అమరవీరుల తల్లిదండ్రులు నిర్వహించిన సభలోనూ గళం విప్పారు. అదే వేదికపై ఐదేళ్ల క్రితం నుంచి దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వీసీకే పార్టీ నేత తిరుమావలయన్‌తో కలిసి పాల్గొన్నారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు డిమాండ్‌తో న్యాయవాదులు గుంటూరు కోర్టు ప్రాంగణంలో జరిపిన సభలో గద్దర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. పల్నాడులోనూ పలు సభల్లో పాల్గొన్నారు. సభల్లో నియమాల ఉల్లంఘనపై గుంటూరు, గురజాల కోర్టుల్లో ఆయనపై ఐదారు కేసులు ఉన్నాయి. వీటి విచారణకు ఆయా కోర్టులకు ఆయన హాజరయ్యారు.

గద్దర్ మృతితో ప్రజాగొంతుక మూగబోయిందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యారావు, దళిత నేత కొరివి వినయ్‌కుమార్, చుండూరు దళిత బాధితుల పోరాట కమిటీ అధ్యక్షుడు జాలాది మోజెస్, క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పీపీ ఆర్‌వీ సాగర్, 'భారత్ బచావో' నాగేశ్వరరావు, మోదుకూరు జాన్సన్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపకుడు గుంటూరు కృష్ణ సహా పలువురు కళాకారులు, ప్రజాసంఘాల నేతలు సంతాపం తెలిపారు.

మోడల్ రైల్వేస్టేషన్‌గా రేపల్లె

- గూడ్స్ సౌకర్యం మెరుగుపడేలా చర్యలు
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చిత్రంలో మంత్రి మేరుగ నాగార్జున తదితరులు

రేపల్లె రూరల్: అమృత్ భారత్ పథకంలో భాగంగా రేపల్లె రైల్వే స్టేషన్‌ను ఆధునిక సాంకేతికతతో మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్టు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. రూ.25.6 కోట్లతో స్టేషన్ ఆధునికీకరణ పనులకు ఆదివారం వర్చ్యువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. రేపల్లె స్టేషన్‌లో జరిగిన శిలాఫలక ఆవిష్కరణలో పాల్గొన్న మోపిదేవి మాట్లాడుతూ 1931లో ఏర్పడిన ఈ రైల్వేస్టేషన్ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ రైల్వే గూడ్స్ రవాణా సౌకర్యం లేకపోవటం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేపల్లె ప్రాంతం నుంచి అంతర్జాతీయస్థాయిలోకి ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయని, రైల్వే రవాణా సౌకర్యం ఉంటే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. 2010-11లో మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం-బాపట్ల రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు చేయగా సర్వే పనులూ పూర్తయ్యాయని, అయితే ఆ ప్రాజెక్టు అర్ధంతరంగా నిలిచిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాలతో ప్రస్తుతం మచిలీపట్నం, నిజాంపట్నంలలో మేజర్ పోర్ట్, ఫిషింగ్ హార్బర్ల ఆధునికీకరణ వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయని వివరించారు. ఈ ప్రాంతంలోని మత్స్య సంపద, సముద్ర ఉత్పత్తులు చెన్నై, కోల్‌కతా, ముంబై వంటి ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతున్నందున రైల్వే గూడ్స్ రవాణా అభివృద్ధి ఎంతో అవసరమన్నారు. కృష్ణా-గుంటూరు జిల్లాలను అనుసంధానిస్తూ పెనుమూడి-పులిగడ్డ వారధి ఏర్పడిన అనంతరం ఆయా జిల్లాల మధ్య రాకపోకలు పెరిగాయని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దిగమర్రు నుంచి ఒంగోలు వరకు రేపల్లె తీరప్రాంత వెంబడి రూపుదిద్దుకుంటున్న 216 జాతీయ రహదారిలో రవాణ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. దీంతో పాటుగా మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం-బాపట్ల రైల్వేలైన్ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి మంజూరయ్యేలా కృషిచేస్తామని మోపిదేవి వెల్లడించారు.

ఆధునికీకరణ అభినందనీయం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు అమృత్‌భారత్ పథకంలో శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు స్టేషన్‌లు ఎంపిక కాగా వాటిలో రేపల్లె ఒకటి కావటం మన ప్రాంత అదృష్టమన్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తూ గూడ్స్ రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల శిలాఫలాకాన్ని మంత్రి నాగార్జున ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, తహసీల్దార్ మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, రైల్వే ఏడీఆర్‌ఎం సైమన్, డివిజనల్ కోఆర్డినేటర్ అనూష, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసాలకు చంద్రబాబే బాధ్యుడు


- ఎమ్మెల్సీ పోతుల సునీత
- చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్సీ సునీత, నాయకులు

చీరాల: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు సృష్టించి తన రాజకీయ మనుగడ కోసం ప్రాజెక్టుల సందర్శన పేరుతో విధ్వంసాలు సృష్టిస్తున్న చంద్రబాబునాయుడు నీచ సంస్కృతికి నిదర్శనమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు పుంగనూరులో జరిగిన యాత్రలో కావాలనే రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్నారని నిరసిస్తూ ఆదివారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లో ఎమ్మెల్సీ సునీత ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబు ప్రాజెక్టు సందర్శన పేరుతో తన పార్టీ రౌడీ మూకలతో విధ్వంసాలు సృష్టిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న మంచిపేరు చెడగొట్టాలనే తలంపుతో చంద్రబాబు దాడులకు ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. కుట్రలు, కుతంత్రాల్లో పీహెచ్‌డీ చేసిన చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ తీసుకురావాలనే లక్ష్యంతో ప్రాజెక్టుల సందర్శన, యాత్రలు, బహిరంగ సభలు నిర్వహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పుంగనూరులో జరిగిన దాడిలో యాభై మంది పోలీసులు, ప్రజలు తీవ్ర గాయాల పాలయ్యారని, ప్రజల ప్రాణాలతో చెలగాటాలు ఆడుతున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికలే ఆఖరి ఎన్నికలవుతాయని జోస్యం చెప్పారు. తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లెల బుల్లిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 514.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 861.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 35,837 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

నేటి నుంచి ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్-2023)లో అర్హత సాధించి, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈనెల 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు గడువు ఉంది. ఆప్షన్లను మార్చుకునేందుకు ఈనెల 13 చివరి తేదీ. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఈనెల 17న సీట్ల కేటాయింపు జరపనుంది. ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసిన సాంకేతిక విద్యాశాఖ రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులకు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థులు తమ ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదుకు అవకాశం ఉండగా, ప్రైవేటు ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు హెల్ప్‌లైన్ కేంద్రాలకూ వెళ్లవచ్చు. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంతోపాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. గుంటూరు, నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లోని 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి 22,290 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఏపీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు 25వేల మందికి పైగా ఉన్నారు.

అత్యుత్తమ వైద్యం అందించడమే సీఎం లక్ష్యం

ఏపీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదల అశోక్‌బాబు



చినగంజాం: పేదలందరికీ మంచి వైద్యం అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అని ఏపీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదల అశోక్ చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న చినగంజాం మండలం పల్లెపాలెం గ్రామానికి చెందిన దండుప్రోలు శ్రీనివాసరావును ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి అశోక్‌బాబు పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాసరావు ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబును ఫోన్ ద్వారా సంప్రదించారు. వెంటనే ఆయన స్పందించి శ్రీనివాసరావు ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయించారు. రవాణా ఖర్చులతో పాటు వైఎస్సార్ ఆసరా ద్వారా కూడా నగదు మంజూరు చేయించారు. దీంతో శ్రీనివాసరావు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పేదలకు వరమని పేర్కొన్నారు. పేదల వైద్యం కోసం ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిందని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో చిత్తూరు జిల్లా పుంగనూరులో చంద్రబాబు సృష్టించిన విధ్వంసకాండకు నిరసన తెలిపారు. తొలుత స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రాజెక్టు సందర్శన పేరుతో పుంగనూరులో రోడ్‌షో నిర్వహించి చంద్రబాబు నాయుడు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో వచ్చిన ఆదరణ చూసి అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. నీచ రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ మాట్లాడుతూ టీడీపీకి అంతరించి పోయేందుకు కాలం దగ్గర పడిందన్నారు. నారా లోకేష్‌తో ఎన్ని యాత్రలు చేయించిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మళ్లీ కాబోయే ముఖ్యమంత్రి జగనన్నే అని చెప్పారు. పార్టీ బల్లికురవ మండల కన్వీనర్ చింతల పేరయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ సోని, జజ్జర ఆనందరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్, పూనూరి నరేంద్ర, జువ్విరాము, గూడా శ్రీనివాసరెడ్డి, చిన్ని శ్రీమన్నారాయణ, నర్రావుల కొండలు, కొల్లా భువనేశ్వరి, సాంబిరెడ్డి, చైతన్య కిషోర్, గుంటూరు మాధవరావు పాల్గొన్నారు.


అద్దంకిలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉత్సాహంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు


ఫ్లడ్‌లైట్ల వెలుగులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

చీరాల రూరల్: జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. చీరాల కొత్తపేటలో ప్రసాద్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను రెండోరోజు మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఫ్లడ్ లైట్ల వెలుగులలో ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ పోటీలలో వివిధ క్రీడా జట్లు తలపడ్డాయి. తొలుత వాడరేవు వర్సెస్ ప్రసాదనగర్ జట్లు తలపడగా ప్రసాదనగర్ జట్టు విజేతగా నిలిచింది. దండుబాట ఫ్రెండ్స్ వర్సెస్ వాడరేవు–బి జట్లు తలపడగా దండుబాట ఫ్రెండ్స్ జట్టు విజయం సాధించింది. పర్చూరు వర్సెస్ రామాపురం మ్యాచ్‌లో పర్చూరు జట్టు విజయం సాధించింది. పూసూరు వర్సెస్ స్టూవర్టుపురం మ్యాచ్‌లో స్టూవర్టుపురం జట్టు విజేతగా నిలిచింది. కొత్తపేట వర్సెస్ తెలంగాణ–2 మ్యాచ్‌లో కొత్తపేట జట్టు విజయం సాధించింది. తోటవారిపాలెం శివ ఫ్రెండ్స్ వర్సెస్ తానా యూత్ మ్యాచ్‌లో శివ ఫ్రెండ్స్, కిల్లర్స్ వర్సెస్ పండు ఫ్రెండ్స్ వాడరేవు మ్యాచ్‌లో పండు ఫ్రెండ్స్ జట్టు, గున్నపి సైకి టీమ్ వర్సెస్ పాస్ కాలేజి మ్యాచ్‌లో గున్నపి సైకి టీమ్, బన్ను ఫ్రెండ్స్ వర్సెస్ శాంతినగర్ మ్యాచ్‌లో శాంతినగర్, జాషువా యూత్ వర్సెస్ మున్నంవారిపాలెం మ్యాచ్‌లో మున్నంవారి పాలెం జట్టు విజయం సాధించింది. పోటీలకు అంపైర్లుగా రవీంద్రబాబు, బాలగురవయ్య అచ్చయ్య, శ్రీను, శివ వ్యవహరించారు. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడా ప్రేమికులు, ప్రేక్షకులు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ హుమయూన్ కబీర్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

- హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం
- హోసన్నా మినిస్ట్రీస్, కృపా మినిస్ట్రీస్, ఏఈఎల్‌సీ, ఇతర క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులో భారీ శాంతిర్యాలీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

నెహ్రూనగర్: సభ్యసమాజం సిగ్గుపడేలా మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం బాధాకరమని, మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడంతో పాటు ఈ సంఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని పలువురు క్రైస్తవ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులు, మహిళలపై జరుగుతున్న మరణకాండలను నిరసిస్తూ ఆదివారం హోసన్నా మినిస్ట్రీస్, కృపా మినిస్ట్రీస్, ఏఈఎల్‌సీ, ఇతర క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని లాడ్జిసెంటర్ నుంచి ఏసీ కాలేజీ మీదుగా నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూల్ వరకు భారీ శాంతిర్యాలీ నిర్వహించారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం మాట్లాడుతూ మణిపూర్ సంఘటన బాధితులకు క్రైస్తవులంతా అండగా ఉంటారన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన భారత్‌లోనే ఇలాంటి అవమానీయ సంఘటనలు జరగడం శోచనీయమన్నారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం శుభపరిణామన్నారు. కృపా మినిస్ట్రీస్ అధినేత బ్రదర్ మాథ్యూస్ మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి కలుగ జేసేలా కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్రైస్తవులను కొట్టి చంపడం విచారించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా కేంద్రం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. మణిపూర్ ఘటనకు వేలాది మంది క్రైస్తవులు మద్దతు తెలియజేయడం అభినందనీయమన్నారు. క్రైస్తవ సంఘ సమాఖ్య కన్వీనర్ ఈరి రాజశేఖర్ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవ హక్కులను కాపాడాలని కోరారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు మోజేస్ ఆర్నాల్డ్, లెనిన్, పృథ్వీరాజ్, రంజిత్, వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

తల్లిపై గొడ్డలితో కొడుకు దాడి

పర్చూరు(చినగంజాం): తల్లిపై కనికరం లేకుండా దాడి చేసిన ఘటన పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఎన్.చెంచు ప్రసాద్ అందించిన వివరాలు.. మండలంలోని కొత్తపాలేనికి చెందిన మద్ది పేరమ్మను ఆమె చిన్నకొడుకు మద్ది అంజయ్య మద్యం తాగి శనివారం రాత్రి రెండు ఎకరాల పొలం తన పేరుతో రాయమని అడిగాడు. రాయలేదని గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను వైద్య చికిత్స నిమిత్తం చీరాల ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బండ్లమ్మవారి సేవలో ఆర్డీఓ సరోజిని


అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో బాపట్ల జిల్లా చీరాల ఆర్డీఓ పత్తికోట సరోజని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ విశేషాల గురించి ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి వివరించారు. అమ్మవారి శేషవస్త్రాన్ని, అమ్మవారి చిత్రపటాన్ని ఆర్డీఓకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు బుద్దా వెంకటలక్ష్మి, కుంచల నరసారెడ్డి, పూజారులు దొంతిబోయిన బల్లారెడ్డి పాల్గొన్నారు.

చుండూరు అమరవీరులకు నివాళి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న భాస్కరరావు

చీరాల రూరల్: ఏపీ సమతా సైనిక్ దళ్, చీరాల దళిత యువత ఆధ్వర్యంలో చుండూరు అమరవీరుల సంస్మరణ సభ ఆదివారం రాత్రి స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు ఇచ్చినప్పటికీ వాటిని కొంతమంది కాలరాస్తు ఆయా హక్కులను హరించి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులందరూ ఐకమత్యంతో ఉంటూ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుడ్డు భాస్కరరావు, గోపతోటి బాబూరావు, కంచర్ల చిట్టిబాబు, గోసాల సుధాకర్, జాలాది మోహన్, పట్టణంలోని అన్ని దళిత వాడల నుండి పెద్ద సంఖ్యలో యువకులు, అంబేడ్కరిస్టులు హాజరయ్యారు.

కాలు జారి కాలువలో పడి వ్యక్తి మృతి

సంతమాగులూరు(అద్దంకి): ప్రమావశాత్తు కాలు జారి కాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొమ్మాలపాడు ఎన్నెస్పీ కాలువ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు.. అద్దంకి పట్టణానికి చెందిన తన్నీరు శ్రీనివాసరావు అలియాస్ ఉంగరాల శ్రీను(70) సుబాబుల్ కర్ర వ్యాపారం చేస్తుంటాడు. ఈక్రమంలో ఆదివారం తమ బంధువుల గ్రామమైన సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెం వెళ్లాడు. తిరిగి తన టీవీఎస్ మోపెడ్‌పై ఇంటికి వస్తూ మధ్యలో కొమ్మాలపాడు వద్ద కాలకృత్యం తీర్చుకోవడం కోసం కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తు ముందుకు పడి మృతి చెందాడని భావిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కోడలు తన్నీరు శిరీష ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోలీసులు బయటకు తీయించి పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్ సీపీలోనే వడ్డెరలకు ప్రాధాన్యం

వడ్డెర యువ చైతన్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ కిషోర్


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: వడ్డెరలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ప్రాధాన్యత లభించిందని వడ్డెర యువ చైతన్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచాల కృష్ణ కిషోర్ అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రన్నింగ్ రూమ్ సెంటర్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి చిత్రపటాలకు వడ్డెర సంఘం నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కుంచాల కృష్ణ కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వున్న 40 లక్షల వడ్డెరలను గుర్తించి, చంద్రగిరి ఏసురత్నంకు ఎమ్మెల్సీ ఇచ్చారని అన్నారు. మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి తమ కులానికి కమ్యూనిటీ హాల్ నిర్మించాలనే ఉద్దేశ్యంతో మంగళగిరి బైపాస్‌రోడ్‌లో స్థలాన్ని కేటాయించారని అన్నారు. కార్యక్రమంలో మినిగ ఆంజనేయులు, గూగుల్ శ్రీనివాసరావు, ఉప్పు నాగరాజు, తన్నీరు సురేష్, బత్తుల శివ వేముల వెంకటేష్, వేముల కోటేశ్వరరావు, కుంచాల రాజు, బత్తుల శ్రీనివాస్, ఉప్పుల ఏడుకొండలు, ఈర్ల పెద్దబాబు, బత్తుల నారాయణ, ఉప్పు శ్రీను, గుంజ అంబారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యోగాసన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు పొందిన విద్యార్థులతో డీఎస్పీ గోలి లక్ష్మయ్య, కార్పొరేటర్ సుబ్బారెడ్డి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీఓ కాలనీలోని సుమేధ హైస్కూల్లో ఆదివారం యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. యోగాసన పోటీలను ఇంటెలిజెన్స్ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, స్థానిక కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, పాఠశాల చైర్మన్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. యోగాసన పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సబ్ జూనియర్ విభాగంలో పి.భార్గవి, ఎ.రాజేష్, జూనియర్ విభాగంలో పి.వెంకట త్రివేణి, సీఎం విశ్వనాథరెడ్డి, సీనియర్స్‌లో ఎ.ఉదయ్‌కుమార్, టి.తేజస్విని ప్రథమ బహుమతులు సాధించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.మల్లికార్జునరావు, యోగా గురువులు తేజస్వి, బి.సురేష్, సి.విష్ణువర్ధన్ రెడ్డి, ఎ.సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల విజేత మల్లేశ్వరరావు

గుంటూరు వెస్ట్(క్రీడలు): లీలావతి మెమోరియల్ రాష్ట్రస్థాయి చెస్ పోటీల విజేతగా జె.మల్లేశ్వరరావు నిలిచాడు. ఆదివారం స్థానిక గార్డెన్స్‌లోని గొంది సీతారామయ్య హాల్‌లో నిర్వహించిన పోటీల్లో డి.ధృవేష్, వి.మోహిత ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. అండర్–15 బాలికల విభాగంలో ఎం.వైష్ణవి కార్తీక, వెటరన్ విభాగంలో జి.ప్రసాదరావులు గెలుపొందారు. అనంతరం విజేతలకు బహుమతులను ఆడిటర్ డి.శ్రీనివాసరావు, జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు సిహెచ్ రవీంద్ర రాజు డాక్టర్ యార్లగడ్డ వీర శేఖర్ అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి, హరిహరరాయులు, కాశయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజానికి క్రీడలు దోహదం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి
- ముగిసిన జీఎస్ఆర్ మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలు


జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథితో బ్యాడ్మింటన్ విజేతలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): భావితరాలు ఆరోగ్యంగా జీవించాలంటే తల్లిదండ్రులు వారి పిల్లల్ని క్రీడా సాధన వైపు ప్రోత్సహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి సూచించారు. గత మూడు రోజుల నుంచి జీఎస్ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో జరుగుతున్న గుజ్జుల సుధాకరరెడ్డి మెమోరియల్ బాల బాలికల అండర్–13, 15, 17 తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ అకాడమీలు క్రీడల్ని ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జీఎస్ఆర్ అకాడమీ సీఈఓ డాక్టర్ కె.సావిత్రి మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి అనుక్షణం క్రీడాభివృద్ధికే కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగింపుగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఏర్పాటు చేసి చిన్నారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ నుంచి 560 మంది చిన్నారులు పాల్గొన్నారని చెప్పారు. పోటీల నిర్వహణకు ఎందరో సహాయ సహకారాలందించారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చిన్నారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, ఆర్టీఏ కమిషనర్ శామ్యూల్ జొనాథన్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ వైస్‌చైర్మన్ పి.రామచంద్ర రాజు, మేరుగ విజయలక్ష్మి, టోర్నమెంట్ కార్యదర్శి సిహెచ్.విల్సన్ బాబు, కె.ఓంకార్, ఫణిదీప్, వెంకట కృష్ణ బహుమతులు అందజేశారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కి ఘననివాళి


గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి డొక్కా, ప్రజాసంఘాల నేతలు

నెహ్రూ నగర్: గుంటూరు దళిత బహుజన ఫ్రంట్ కార్యాలయంలో ప్రజాగాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్య వరప్రసాద్ పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ గద్దర్ ఐదు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలకు తన పాట ద్వారా ప్రజా ఉద్యమాలకు ప్రేరణశక్తిగా, ప్రజా యుద్ధనౌకగా పీడిత ప్రజల పక్షాన నిలబడిన సాంస్కృతిక యోధుడని కొనియాడారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.
డీబీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయకుమార్, సీనియర్ న్యాయవాది వైకే, ఉన్నం సుధాకర్, డీబీఎఫ్ నాయకుడు సునీల్ కుమార్, లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకుడు చంద్రానాయక్, డీబీఎఫ్ నాయకుడు సూరిబాబు, రైల్వే ఉద్యోగుల సంఘ నాయకుడు సుద్దపల్లి వసంత కుమార్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు పేరం పవన్ కుమార్ పాల్గొని నివాళులర్పించారు.

సంస్కృత కళాశాలల అభివృద్ధికి కృషి

తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి


సభలో మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

పాత గుంటూరు: సంస్కృత కళాశాలలకు పూర్వ వైభవం తీసుకు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. బ్రాడీపేటలోని పెన్షనర్ల సమావేశ మందిరంలో పొన్నూరు భావన్నారాయణ స్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థిని లక్ష్మీపార్వతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగు భాష , సంస్కృతి ద్వారానే ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి సుసాధ్యం కాగలదన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా కళాశాలలో 1962–1983 మధ్య చదివిన పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో కలిశారు. సమ్మేళనంలో విశ్రాంత ప్రిన్సిపాల్ తాళ్ళూరి ఆంజనేయులు, వివిధ హోదాలలో పనిచేసిన కె.పద్మేశ్వరరావు, గాంధీ, వెంకట్రావు, శివరామకృష్ణ, దావులూరి రాజేంద్రప్రసాద్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, ఎం.కృష్ణ కిషోర్, నిమ్మరాజు శ్రీనివాస మూర్తి, పీబీడీవీ ప్రసాద్, నారాయణం రాంబాబు, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.చలపతిరావు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శివశంకరరావు, ఏసీ ఎన్.శ్రీనివాసరెడ్డి

పెదకాకాని: శివాలయంలో దాతల సహకారంతో అభివృద్ధి పనులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అధ్యక్షత వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ఆలయంలో ప్రతి సంవత్సరం దాతల సహకారంతో ఘనంగా పవిత్రోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రావణమాసంలో అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రతి శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవలను ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లకు నిత్య కల్యాణం ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. శ్రావణమాసంలో సహస్ర చండీ యాగం చేసే విధంగా తీర్మానించారు. చివరిగా జూలై మాసం జమా ఖర్చులు, భక్తుల సౌకర్యాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు గజ్జల సుబ్బాయమ్మ, కొమ్మూరి శివరత్నాలు, కారంకి శివనాగేశ్వరమ్మ, చీడిపూడి అరుణ, కాట్రోత్ పార్వతి, మందాళ జ్యోతి, తోట రవీంద్ర, గంగవరపు మల్లేశ్వరరావు, గుమ్మళ్ల వెంకటరావు, పాలడుగు వెంకటేశ్వరరావు, ఎక్స్ అఫిషియో సభ్యుడు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

యడ్లపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం. సుభాని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ (ఏపీటీఈఏ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా పల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ పి. రమేష్ పర్యవేక్షణలో విజయవాడలో శనివారం సంఘం సర్వసభ్య సమావేశంతో పాటు అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో తాను అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శి సామా సుబ్బారావు (మైనంపాడు డైట్ లెక్చరల్) కోశాధికారి డాక్టర్ రాజాబాలాజీరావు (మైనంపాడు డైట్ లెక్చరల్)తో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా డైట్ కళాశాలల్లో లెక్చరర్ల ఖాళీల భర్తీకి, 91 మంది సీనియర్ లెక్చరర్ల పదోన్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఐదు సంవత్సరాల సర్వీసు నిబంధన సడలించాలి

రెంటచింతల: ఉపాధ్యాయుల్ని రెగ్యులరైజేషన్ చేయడానికి 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీసు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నిబంధన సడలించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. స్థానిక యూటీఎఫ్ మండల శాఖ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 10,200 మందిని రెగ్యులరైజేషన్ ముందుగా నిర్ణయించిందని, అయితే ఐదు సంవత్సరాల సర్వీసు ఉండాలని పెట్టిన నిబంధన కారణంగా నాలుగు వేల మంది నష్టపోతున్నారని తెలిపారు. నిబంధన తొలగించి నష్టపోతున్న వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.